# బలగం BALAGAM TV

BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com

హైదరాబాద్ ఆదివారం 01 మార్చి 2026 | www.balagamtv.com | పేజీలు 4





వివరాలు 4వ పేజీలో

## 67 ఏళ్ల నిరీక్షణకు తెర

### రంజీ ట్రోఫీని తొలిసారి ముద్దాడిన జమ్మూ కశ్మీర్

# 'ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక'కు శ్రీకారం

### మార్చి 6 నుంచి 99 రోజులపాటు రాష్ట్రవ్యాప్తంగా కార్యక్రమం




- గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు అమలు
- పౌర సేవలను సులభతరం చేసేలా సంస్కరణలు
- సీనియర్ ఐఏఎస్ జయేశ్ రంజన్ ఆధ్వర్యంలో కమిటీ
- అన్ని శాఖల అధికారులతో సమీక్షా సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులు, ప్రజోపయోగ కార్యక్రమాలను ప్రజలకు మరింత చేరువ చేయాలనే లక్ష్యంతో 'ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక' కార్యక్ర మాన్ని చేపడుతున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. మార్చి 6వ తేదీ నుంచి జూన్ 12 వరకు 99 రోజులపాటు ఈ కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా అమలు చేయాలని అన్ని శాఖల కార్యదర్శులు, ఉన్నతాధికారులకు ఆదేశాలు జారీ చేశారు. జూన్ 2న రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని 4 కోట్ల ప్రజల పండుగగా ఘనంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో 99 రోజుల కార్యక్రమాన్ని బాధ్యతాయుతంగా, ప్రణాళికాబద్ధంగా అమలు చేయాలని సూచించారు.డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో అన్ని శాఖల ముఖ్య కార్యదర్శులు, కార్యదర్శులతో ముఖ్యమంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

**సాంకేతిక సంస్కరణలకు ప్రాధాన్యం**

పరిపాలనలో ఆధునాతన సాంకేతికతను సమర్థంగా వినియోగించి పౌర సేవలను సులభతరం చేయాలని ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు. కరెంట్ మీటర్, ఇంటి అనుమతి, నల్లా కనెక్షన్ వంటి అనుమతుల కోసం ప్రజలు కార్యాలయాలకు రావాల్సిన అవసరం లేకుండా ఆన్‌లైన్ విధానాన్ని విస్తరించాలని సూచించారు. ఏ దరఖాస్తు ఎక్కడ పెండింగ్‌లో ఉందో తెలుసుకునే పారదర్శక వ్యవస్థను తీసుకురావాలని పేర్కొన్నారు.

సాంకేతిక సంస్కరణల అమలుకు సీనియర్ ఐఏఎస్ అధికారి జయేష్ రంజన్ ఆధ్వర్యంలో ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసి మూడు వారాల్లో నివేదిక సమర్పించాలని ఆదేశించారు. అన్ని శాఖల్లో ఈ-ఆఫీస్, డిజిటల్ గవర్నెన్స్ విధానాలను పటిష్టంగా అమలు చేయాలని, డేటా సర్వర్లను రాబోయే 20 సంవత్సరాలకు సరిపడేలా నవీకరించాలని సూచించారు.

**సంక్షేమ పథకాల పకడ్బందీ అమలు**

మహాలక్ష్మి, రేషన్ కార్డులు, రూ.500 గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల లోపు ఉచిత విద్యుత్తు, ఆరోగ్య శ్రీ వంటి పథకాలు అర్హులందరికీ చేరేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సొంత స్థలం ఉండి ఇల్లు లేని వారికి ఇందిరమ్మ ఇళ్ల లబ్ధి అందేలా చూడాలని పేర్కొన్నారు.

**విద్య, వైద్య రంగాల్లో సంస్కరణలు**

ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా నాణ్యమైన విద్య అందించేందుకు వంద మండలాల్లో తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ ప్రారంభించనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్య సేవలను మెరుగుపర్చాలని సూచించారు.

**ఆర్థికాభివృద్ధి దిశగా చర్యలు**

తెలంగాణ రైజింగ్ విజన్‌లో భాగంగా రాష్ట్రాన్ని క్యూర్, ప్యూర్, రేర్ జోన్లుగా విభజించి ఆర్థికాభివృద్ధికి దారితీస్తామని తెలిపారు. అవుటర్ రింగ్ రోడ్డు నుంచి రీజనల్ రింగ్ రోడ్డు వరకు ఉన్న పెరి అర్బన్ ప్రాంతాన్ని సుమారు 10 వేల చ.కి.మీ. మ్యానుఫాక్చరింగ్ జోన్‌గా అభివృద్ధి చేయాలని ప్రణాళిక రూపొందించాలని సూచించారు.

హైదరాబాద్‌లో నిర్వహించిన తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్, వరల్డ్ ఎకనమిక్ ఫోరం, విదేశీ పర్యటనల ద్వారా దాదాపు రూ.8 లక్షల కోట్ల పెట్టుబడులు రాష్ట్రానికి వచ్చినట్లు తెలిపారు. కుదిరిన అవగాహన ఒప్పందాలు కార్యరూపం దాల్చేలా కార్యదర్శులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

**పారదర్శక పరిపాలన లక్ష్యం**

రాష్ట్రంలోని ప్రభుత్వ కార్యాలయాలు అద్దె భవనాల్లో కాకుండా సొంత భవనాల్లో ఉండేలా బడ్జెట్ ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. ఫైళ్ల క్లియరెన్స్, కార్యాలయాల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని, 99 రోజుల కార్యక్రమ పురోగతిని వ్యక్తిగతంగా సమీక్షిస్తానని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ప్రజలు ఉంచిన విశ్వాసాన్ని సుపరిపాలనతో నిలబెట్టుకోవాల్సిన బాధ్యత అధికారులందరిపైనా ఉందని, వచ్చే ఎన్నికల నాటికి మిగిలిన కాలానికి స్పష్టమైన కార్యాచరణ రూపొందించాలని ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు.

## కోకాపేట భూములు శారదా పీఠానికే కొనసాగాలి

- జలమండలికి కేటాయింపులు రద్దు చేయాలని సీఎం ఆదేశం

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

నగరంలోని కోకాపేటలో శారదా పీఠానికి కేటాయించిన భూములను తిరిగి పీఠానికే కొనసాగించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. పీఠం భూములను జలమండలికి కేటాయించిన నేపథ్యంలో అక్కడ జరుగుతున్న నిర్మాణ పనులపై పీఠం ప్రతినిధులు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ఈ అంశంపై రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కోకాపేట భూముల్లో పీఠం ఆధ్వర్యంలో సాగుతున్న నిర్మాణాల ప్రస్తుత పరిస్థితిని వివరంగా అడిగి తెలుసుకున్నారు. పీఠం భూములను జలమండలికి కేటాయించే సమయంలో అక్కడి నిర్మాణాల స్థితిని తెలియజేయకపోవడంపై ముఖ్యమంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు.జలమండలికి చేసిన కేటాయింపులను రద్దు చేసి భూములను శారదా పీఠానికే కొనసాగించాలని స్పష్టం చేశారు. ఈ విషయమై మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబును కలిసి నిర్మాణాలు, ఇతర పరిస్థితులపై పూర్తి వివరాలు అందించాలని పీఠం ప్రతినిధులకు సూచించారు.

# హెచ్‌పీవీ టీకా కార్యక్రమానికి శ్రీకారం

### దేశవ్యాప్తంగా 1.15 కోట్ల బాలికలకు ఉచిత వ్యాక్సిన్
### అజ్మేర్‌లో ప్రారంభించిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ




**బలగం టీవీ, అజ్మేర్**

రాజస్థాన్‌లోని అజ్మేర్‌లో హెచ్‌పీవీ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించారు. మహిళల్లో గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌తో పాటు నివారించదగిన ఇతర రకాల క్యాన్సర్లను అరికట్టడమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. ఈ కార్యక్రమంలో భాగంగా 14, 15 ఏళ్ల బాలికలకు 'గార్డాసిల్' టీకాను ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లో ఉచితంగా అందించనున్నారు. దేశవ్యాప్తంగా సుమారు 1.15 కోట్ల బాలికలకు ఈ టీకాలు వేయాలని కేంద్ర ఆరోగ్య శాఖ లక్ష్యంగా పెట్టుకుంది.

ఈ సందర్భంగా ప్రధానమంత్రి ఎక్స్ వేదికగా స్పందిస్తూ, "దేశంలోని ఆడబిడ్డల ఆరోగ్యం విషయంలో ఎటువంటి అవకాశాన్ని వదులుకోము. వారి ఆరోగ్య రక్షణ కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటాం. అజ్మేర్‌లో హెచ్‌పీవీ టీకా కార్యక్రమాన్ని ప్రారంభించాం. గర్భాశయ క్యాన్సర్ నివారణే దీని ముఖ్య ఉద్దేశం" అని పేర్కొన్నారు. దేశవ్యాప్త హెచ్‌పీవీ వ్యాక్సినేషన్ కార్యక్రమం ప్రజారోగ్య రంగంలో కీలక అడుగుగా భావిస్తున్నారు. కేంద్రం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'స్వస్థ నారి' విజన్‌లో భాగంగా ఈ టీకా కార్యక్రమాన్ని ప్రతి ఏడాది నిర్వహించనున్నారు. మొదటి మూడు నెలలు యుద్ధప్రాతిపదికన అమలు చేసి, అనంతరం దేశవ్యాప్త సాధారణ రోగనిరోధక షెడ్యూల్‌లో చేర్చనున్నారు.

**ఉచితంగా టీకా -- ప్రత్యేక ఏర్పాట్లు**

మార్కెట్‌లో వేల రూపాయల ఖరీదు చేసే ఈ వ్యాక్సిన్‌ను ప్రభుత్వం ఉచితంగా అందుబాటులోకి తీసుకువచ్చింది. ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఉపజిల్లా, జిల్లా ఆసుపత్రులు, కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రాలు, ప్రభుత్వ వైద్య కళాశాలల్లో టీకా అందుబాటులో ఉంటుంది. తల్లిదండ్రులు లేదా సంరక్షకుల నుంచి సమ్మతి తీసుకున్న తర్వాతే టీకా ఇవ్వనున్నారు.

**వైద్యుల పర్యవేక్షణలో అమలు**

శిక్షణ పొందిన వైద్యుల పర్యవేక్షణలో టీకా కార్యక్రమం జరుగుతుంది. ప్రతి సెషన్‌లో వైద్య బృందాలు అందుబాటులో ఉంటాయి. టీకా అనంతరం ఏవైనా సమస్యలు తలెత్తితే 24 గంటల వైద్య సహాయం అందేలా ఏర్పాట్లు చేశారు.

అధికార గణాంకాల ప్రకారం మహిళల్లో సంభవిస్తున్న క్యాన్సర్ మరణాల్లో గర్భాశయ క్యాన్సర్ రెండో అతిపెద్ద కారణం. భారత్‌లో ప్రతి ఏడాది సుమారు 1.2 లక్షల కొత్త కేసులు నమోదవుతుండగా, దాదాపు 80 వేల మంది ప్రాణాలు కోల్పోతున్నట్లు గణాంకాలు సూచిస్తున్నాయి. అయితే, ముందస్తు టీకా, స్క్రీనింగ్ ద్వారా గర్భాశయ క్యాన్సర్‌ను పూర్తిగా నివారించవచ్చని వైద్య నిపుణులు స్పష్టం చేస్తున్నారు.

## ఆరోగ్య రంగంలో చారిత్రాత్మక ఘట్టానికి శ్రీకారం

- క్యాన్సర్ నియంత్రణ కోసం సమగ్ర విధానం
- రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహా
- కింగ్ కోఠి హాస్పిటల్లో హెచ్‌పీవీ వ్యాక్సినేషన్ డ్రైవ్ ప్రారంభం

వివరాలు 4వ పేజీలో





# ఏపీలో ఘోర పేలుడు

### బాణాసంచా కర్మాగారంలో 21 మంది సజీవదహనం

- టపాసులు తయారు చేస్తుండగా ప్రమాదం
- పరారీలో యజమాని
- కాకినాడ జిల్లా సామర్లకోట మండలం వేట్లపాలెంలో ఘటన
- ఏపీ, తెలంగాణ సీఎంల దిగ్భ్రాంతి
- మృతుల కుటుంబాలకు ఏపీ ప్రభుత్వం రూ. 20 లక్షల ఎక్స్‌గ్రేషియా

**బలగం టీవీ, కాకినాడ**

ఏపీలోని కాకినాడ జిల్లాలోని సామర్లకోట మండలం వేట్లపాలెం వద్ద బాణాసంచా తయారీ కేంద్రంలో శనివారం భారీ పేలుడు సంభవించి 21 మంది కార్మికులు సజీవదహనం అయ్యారు. ఈ ఘటనతో ప్రాంతమంతా విషాదచ్ఛాయలు అలుముకున్నాయి. వేట్లపాలెం--జి.మేడపాడు మధ్య ఉన్న బాణాసంచా పరిశ్రమలో అకస్మాత్తుగా సంభవించిన పేలుడు తీవ్రతకు మృతదేహాలు ఎగిరిపడ్డాయని స్థానికులు తెలిపారు. మంటలు భారీగా ఎగసిపడడంతో దట్టమైన పొగ చుట్టుపక్కల ప్రాంతాలను కమ్మేసింది. పేలుడు శబ్దం సుమారు ఐదు కిలోమీటర్ల దూరం వరకు వినిపించినట్లు సమాచారం. సమీప గ్రామంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో స్లాబ్‌కు పగుళ్లు వచ్చినట్లు తెలుస్తోంది. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది రెండు ఫైర్ ఇంజిన్లతో మంటలను అదుపులోకి తీసుకురావడానికి ప్రయత్నించారు. తీవ్రంగా గాయపడిన ఎనిమిది మందిని అంబులెన్స్‌ల ద్వారా ఆసుపత్రికి తరలించారు. మృతుల్లో ఎక్కువమంది మహిళలే ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఇదే ప్రాంతంలో గతంలోనూ ఇలాంటి ప్రమాదం

మిగితా 4వ పేజీలో

## టీటీడీ రూ.5,456.26 కోట్ల బడ్జెట్ ఆమోదం

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

తిరుమల తిరుపతి దేవస్థానాలు ట్రస్ట్ బోర్డు 2026--27 ఆర్థిక సంవత్సరానికి రూ.5,456.26 కోట్ల బడ్జెట్‌ను ఆమోదించింది. భక్తులకు మెరుగైన సౌకర్యాలు, భద్రతా వ్యవస్థల బలోపేతం, విద్యా సంస్థల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించింది.

**విద్యా సంస్థలకు రూ.118.89 కోట్లు**

టిటిడి ఆధ్వర్యంలో నడుస్తున్న విద్యా సంస్థల్లో ప్రమాణాలను పెంచేందుకు రూ.118.89 కోట్లు కేటాయించాలని నిర్ణయించింది. ఆధునిక మౌలిక వసతులు, సాంకేతిక సదుపాయాలు, నాణ్యమైన బోధనపై ఈ నిధులు వినియోగించనున్నట్లు సమాచారం.

తిరుమలలోకి వచ్చే లక్షలాది మంది భక్తులకు సౌకర్యాలు మెరుగుపర్చేందుకు, క్యూలైన్ సమీకరణ, వసతి గృహాల అభివృద్ధి, పరిశుభ్రత చర్యలకు ప్రాధాన్యం ఇచ్చింది. అదేవిధంగా భద్రతా ఏర్పాట్లను మరింత కట్టుదిట్టం చేయాలని నిర్ణయించింది.

భక్తుల అనుభవాన్ని మరింత సౌకర్యవంతంగా, సురక్షితంగా మార్చడమే ఈ బడ్జెట్ ప్రధాన ఉద్దేశమని టిటిడి వర్గాలు తెలిపాయి. దేవస్థానం ఆధ్వర్యంలో నడుస్తున్న విద్య, ఆరోగ్య, సామాజిక సేవా కార్యక్రమాల విస్తరణకు కూడా నిధులు కేటాయించినట్లు పేర్కొన్నారు.

## ప్రాజెక్టుల్లో రెండో దశ పూడికతీతకు శ్రీకారం

- వర్షాకాలానికి ముందే పనులు పూర్తి చేయాలి
- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

మట్టితో పేరుకుపోయిన ప్రాజెక్టుల్లో రెండో దశ పూడికతీత పనులను తక్షణమే ప్రారంభించాలని నీటిపారుదల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. వర్షాకాలానికి ముందే పూడికతీత చేపడితే సమృద్ధిగా నీటి నిల్వలు ఏర్పాటు చేసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. రాష్ట్ర సచివాలయంలో నీటిపారుదల శాఖ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.

**నీటి సామర్థ్యం గణనీయంగా తగ్గుదల**

జాతీయ స్థాయిలో మట్టిపూడిక కారణంగా ప్రాజెక్టుల నీటి నిల్వ సామర్థ్యం తీవ్రంగా పడిపోవడం ప్రధాన సమస్యగా మారిందని మంత్రి ఆందోళన వ్యక్తం చేశారు. చారిత్రాత్మక భాక్రా నంగల్ ప్రాజెక్టు నుంచి తెలంగాణలోని ప్రసిద్ధ శ్రీరాంసాగర్ ప్రాజెక్టు వరకు అనేక ప్రాజెక్టులు పూడికతో నీటి సామర్థ్యాన్ని కోల్పోయాయని తెలిపారు. ప్రత్యేకించి శ్రీరాంసాగర్ ప్రాజెక్టులో 120 టీఎంసీల సామర్థ్యం 80 టీఎంసీలకు పడిపోయిందని వివరించారు.

**ఆధునాతన సాంకేతికత వినియోగం**

కేంద్ర ప్రభుత్వం జాతీయ స్థాయిలో తీసుకొచ్చిన పూడికతీత విధానాన్ని రాష్ట్రం అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో అమలు చేస్తున్నదని మంత్రి చెప్పారు. రాష్ట్రంలో ఇప్పటికే మొదటి దశలో చేపట్టిన పనులు జాతీయ మార్గదర్శకాలకు అనుగుణంగానే కొనసాగుతున్నాయని స్పష్టం చేశారు. పైలెట్ ప్రాజెక్ట్‌గా చేపట్టిన కడెం ప్రాజెక్టులో మొదటి దశ పూడికతీత విజయవంతమైందని తెలిపారు. అక్కడ అత్యాధునిక సాంకేతికతను పూర్తిస్థాయిలో వినియోగించినట్లు వెల్లడించారు.

పూడికతీత పనులకు అవసరమైన నిధుల సమీకరణ కోసం ప్రతిపాదనలు సిద్ధం చేసి రాష్ట్ర మంత్రివర్గం ముందుంచి ఆమోదం తీసుకుంటామని మంత్రి తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రాజెక్టుల అసలు నీటి నిల్వ సామర్థ్యం, ప్రస్తుతం ఉన్న నిల్వలపై సమగ్ర అధ్యయనం చేసి తుది ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. సమీక్షా సమావేశంలో నీటిపారుదల శాఖ ప్రధాన కార్యదర్శి ఇ. శ్రీధర్, ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్ జీవన్ పాటిల్, జాయింట్ సెక్రటరీ కే. శ్రీనివాస్, ఇఎన్‌సి రమేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

## హైదరాబాద్‌ను కుప్పకూల్చింది కాంగ్రెస్ ప్రభుత్వమే



- సీఎం రేవంత్‌రెడ్డి అవినీతి, అక్రమాలు, స్కాంల వల్లే ఈ పరిస్థితి
- రియల్ ఎస్టేట్ కోసమే ఫ్యూచర్ సిటీ
- హైదరాబాద్ బీఆర్ఎస్ సమీక్షలో కేటీఆర్

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌ను రెండు సంవత్సరాల కాలంలో అన్ని రంగాల్లో అధఃపాతాళానికి కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకెళ్లిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే.టి. రామారావు (కేటీఆర్) విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అవినీతి, అక్రమాలు, స్కామ్‌ల వల్లే హైదరాబాద్‌కు ఈ దుస్థితి వచ్చిందని ఆరోపించారు. పారిశుధ్యం నుంచి ప్రజా రవాణా వరకు నగరంలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కేటీఆర్ అన్నారు. పారిశ్రామిక ప్రగతి, వ్యాపార వాణిజ్యాలు క్షీణించాయని పేర్కొన్నారు. తాము అధికారంలో ఉన్నప్పుడు మాజీ ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్ రావు నాయకత్వంలో హైదరాబాద్‌ను అంతర్జాతీయ స్థాయి మెట్రో నగరంగా తీర్చిదిద్దామని గుర్తుచేశారు.నగరంలో కరెంట్ కోతలు, మంచినీటి సమస్యలు, దోమల నివారణలో వైఫల్యం వంటి అంశాలు పది సంవత్సరాల క్రితం ఎప్పుడూ లేవని, ప్రస్తుతం తిరిగి కనిపిస్తున్నాయని ఆరోపించారు.

రేవంత్ రెడ్డి తన ఆర్థిక ప్రయోజనాల కోసం మాత్రమే పరిపాలన చేస్తున్నారని, 'ఫ్యూచర్ సిటీ', 'ఫోర్త్ సిటీ' పేరుతో రియల్ ఎస్టేట్ వ్యాపారాలకే ప్రాధాన్యం ఇస్తున్నారని కేటీఆర్ విమర్శించారు. 'హైడ్రా', పారిశ్రామిక భూముల స్కామ్, టిడిఆర్ (౹ణక్మ) వంటి అంశాల్లో భారీ అవినీతి జరిగిందని ఆరోపించారు.ఈ సందర్భంగా హైదరాబాద్‌లో భారత రాష్ట్ర సమితి నగర పరిధిలోని ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌ఛార్జ్‌లతో కేటీఆర్ సుదీర్ఘ సమీక్షా సమావేశం నిర్వహించారు. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో పార్టీ భవిష్యత్ కార్యాచరణ, అసెంబ్లీ సమావేశాల్లో లేవనెత్తాల్సిన అంశాలపై చర్చించారు. రాబోయే కార్పొరేషన్ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని పార్టీ కార్యకలాపాల సమన్వయం కోసం బాధ్యతలను నాయకులకు అప్పగించారు. జీహెచ్ఎంసీకి ఎమ్మెల్సీ దాసోజు శ్రావణ్, మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్; మల్కాజిగిరి కార్పొరేషన్‌కు ఎమ్మెల్సీ శంబిపూర్ రాజు; సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌కు ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డిలకు బాధ్యతలు అప్పగించినట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలను అన్ని వేదికలపై ఎండగడతామని, హైదరాబాద్ ప్రజల ఆకాంక్షల కోసం పోరాటం కొనసాగిస్తామని కేటీఆర్ స్పష్టం చేశారు.

# పశ్చిమాసియాలో మళ్లీ ఉద్రిక్తతలు

- ఇరాన్‌పై ఇజ్రాయిల్,అమెరికా దాడి
- ఇజ్రాయెల్, ఇరాన్ పరస్పర దాడులు

**బలగం టీవీ, న్యూఢిల్లీ**

పశ్చిమాసియాలో మరోసారి ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఇజ్రాయెల్ మరియు ఇరాన్ మధ్య ప్రతీకార దాడులు చోటుచేసుకున్నాయి. స్థానిక కాలమానం ప్రకారం శనివారం తెల్లవారుజామున టెహ్రాన్‌పై ఇజ్రాయెల్-అమెరికా సంయుక్త రాష్ట్రాలు కలిసి దాడులు జరిపినట్లు సమాచారం.దీనికి ప్రతిగా ఇరాన్ స్పందిస్తూ ఇజ్రాయెల్ వైపు సుమారు 30 క్షిపణులు ప్రయోగించినట్లు తెలిపింది. ఇరాన్ పారామిలిటరీ దళమైన ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ డ్రోన్లు, క్షిపణులు ప్రయోగించినట్లు వెల్లడించింది. అయితే తమ వైపు దూసుకొచ్చిన క్షిపణులను గుర్తించి, వాటిలో చాలా వాటిని అడ్డుకున్నామని ఇజ్రాయెల్ రక్షణ దళాలు ప్రకటించాయి.

ఇరాన్‌కు మద్దతు ఇస్తున్న హుతీ ఉద్యమం కూడా ఇజ్రాయెల్‌పై మరియు నౌకా మార్గాలపై తిరిగి క్షిపణి, డ్రోన్ దాడులు చేయాలని భావిస్తున్నట్లు సమాచారం. హుతీ నాయకత్వానికి చెందిన ఇద్దరు వ్యక్తులు శనివారం రాత్రి నుంచే దాడులు జరగవచ్చని పేర్కొన్నప్పటికీ, అధికారిక ప్రకటన మాత్రం వెలువడలేదు. గతంలో డొనాల్డ్ ట్రంప్తో కుదిరిన ఒప్పందం మేరకు ఎర్ర సముద్రంలో వెళ్లే నౌకలపై దాడులను నిలిపివేశారు. అలాగే గాజా వ్యవహారంలో శాంతి ఒప్పందం కుదిరిన తర్వాత ఇజ్రాయెల్‌పై దాడులు ఆపివేశారు. కానీ ప్రస్తుతం ఇరాన్‌పై ఇజ్రాయెల్-అమెరికా దాడులు కొనసాగుతున్న నేపథ్యంలో ఎర్ర సముద్ర నౌకా మార్గాల్లో తిరిగి తమ దాడులను ప్రారంభించాలని హుతీలు భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ పరిణామాలు పశ్చిమాసియాలో భద్రతా పరిస్థితులపై తీవ్ర ఆందోళనలను రేకెత్తిస్తున్నాయి.

ఇరాన్‌పై జరుగుతున్న ఈ సంయుక్త దాడులపై తొలిసారిగా అధికారికంగా స్పందించిన ట్రంప్, అమెరికా జాతీయ భద్రతను కాపాడుకోవడమే ఈ ఆపరేషన్ ప్రధాన ఉద్దేశమని స్పష్టం చేశారు. ఇరాన్ అణు కార్యక్రమాన్ని మళ్లీ పునర్నిర్మించేందుకు ప్రయత్నిస్తోందని, దీర్ఘ శ్రేణి క్షిపణుల తయారీలో వేగం పెంచిందని ఆరోపించారు. ఈ పరిస్థితుల్లో తాము మౌనంగా ఉండలేమని తెలిపారు.

ఇటీవల కొద్దిసేపటి క్రితమే అమెరికా సైన్యం ఇరాన్ భూభాగంలో పోరాట చర్యలు ప్రారంభించిందని ట్రంప్ ధ్రువీకరించారు. ఇరాన్ పాలకుల నుంచి ఎదురవుతున్న ముప్పును పూర్తిగా నిర్మూలించడం ద్వారా అమెరికా ప్రజలు, విదేశాల్లోని తమ దళాలను రక్షించడమే లక్ష్యమన్నారు.ఇరాన్ ప్రభుత్వం ప్రపంచ ఉగ్రవాదానికి ప్రధాన మద్దతుదారుగా మారిందని, అనేక తీవ్రవాద గ్రూపులకు సహాయం చేస్తోందని విమర్శించారు. గత 40 ఏళ్లుగా అమెరికాకు వ్యతిరేకంగా విద్వేష నినాదాలు చేస్తున్నారని, అమెరికా సైనిక స్థావరాలు, మిత్రదేశాలపై దాడులకు ప్రోత్సాహం ఇస్తోందని ఆరోపించారు.

ఇజ్రాయెల్‌తో కలిసి చేపట్టిన ఈ భారీ సైనిక చర్యలో క్షిపణి తయారీ కేంద్రాలు, ఆయుధ పరిశ్రమలు, వ్యూహాత్మక సైనిక స్థావరాలపై లక్ష్యబద్ధ దాడులు నిర్వహిస్తున్నట్లు ట్రంప్ వెల్లడించారు. ముఖ్యంగా క్షిపణి వ్యవస్థలు, రక్షణ మౌలిక వసతులను నేలమట్టం చేయడమే లక్ష్యమని తెలిపారు. అవసరమైతే ఇరాన్ నావికాదళ సామర్థ్యాన్ని కూడా పూర్తిగా దెబ్బతీస్తామని హెచ్చరించారు.

## మదీనా బస్సు ప్రమాద బాధితులకు పరిహారం



**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

సౌదీ అరేబియాలోని మదీనా సమీపంలో జరిగిన ఘోర బస్సు ప్రమాదంలో మరణించిన హైదరాబాద్ వాసుల కుటుంబాలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పరిహా రం అందించారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాల యంలో జరిగిన కార్యక్రమంలో బాధిత కుటుంబాలకు చెక్కులు అందజేశారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని, ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని సీఎం భరోసా ఇచ్చారు. ప్రమాదం జరిగినట్లు తెలుసుకున్న వెంటనే మంత్రి అజహరుద్దీన్ నేతృత్వంలో ప్రతినిధి బృందాన్ని మదీనాకు పంపినట్లు గుర్తుచేశారు. మృతుల కుటుంబ సభ్యులకు తక్షణమే పాస్‌పోర్టులు, వీసాలు ఇప్పించి అక్కడికి పంపించినట్లు తెలిపారు. భారత కాన్సులేట్, సౌదీ ప్రభుత్వంతో సమన్వయం చేసి మృతుల అంత్యక్రియలు జన్నతుల్ బఖీ సమాధి స్థలంలో నిర్వహించారని చెప్పారు.

**రూ.5 లక్షల చొప్పున పరిహారం**

2025 నవంబర్ 17న మదీనా సమీపంలో జరిగిన ఈ ప్రమాదంలో 44 మంది హైదరాబాద్ వాసులు సజీవదహనమైన విషయం తెలిసిందే. మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున, గాయపడిన ఒకరి కుటుంబానికి రూ.3 లక్షల పరిహారం అందజేశారు. దేశం బయట జరిగే ప్రమాదాల్లో మృతిచెందిన వారికి సాధారణంగా ప్రభుత్వాలు పరిహారం చెల్లించే విధానం లేకపోయినా, మానవతా దృక్పథంతో ఈ నిర్ణయం తీసుకున్నామని సీఎం తెలిపారు. ఇటీవల నాంపల్లి అగ్నిప్రమాద బాధిత కుటుంబాలకు

మిగితా 4వ పేజీలో

## రాజ్యసభ అవకాశంపై అధిష్ఠానంపై పూర్తి విశ్వాసం: వీహెచ్

**బలగం టీవీ, న్యూఢిల్లీ**

తనకు రాజ్యసభ అవకాశం కల్పించే విషయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్, పార్టీ అధిష్ఠానం మీద పూర్తి విశ్వాసం ఉందని తెలంగాణ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు వి. హనుమంతరావు తెలిపారు. తెలంగాణలో రెండు రాజ్యసభ స్థానాలు ఖాళీ కానున్న నేపథ్యంలో పలువురు ఆశావహులు రేసులో ఉన్నారు. ఈ నేపథ్యంలో తనకు అవకాశం ఇవ్వాలని వీహెచ్ కోరుతున్నారు.ఢిల్లీలో మీడియాతో మాట్లాడిన ఆయన, పార్టీలో తన పనితీరును పరిశీలించి ముఖ్యమంత్రి తప్పకుండా అవకాశం కల్పిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. పార్టీలో కష్టపడి పనిచేసిన వారికే పదవులు దక్కుతాయని ఇటీవల డీసీసీ శిక్షణ తరగతుల్లో ముఖ్యమంత్రి పేర్కొన్న విషయాన్ని గుర్తుచేశారు.

## విశ్వకర్మ కార్పెంటర్స్ వెల్ఫేర్ సొసైటీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ పూర్తి..

- **కోశాధికారిగా బాసన్ పెళ్లి శ్యామసుందర్ ఏకగ్రీవం**

**బలగం టీవీ, సిరిసిల్ల:**

రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని బి.వై. నగర్‌లో గల విశ్వకర్మ కార్పెంటర్స్ వెల్ఫేర్ సొసైటీ (రి.నం 619/2003) కార్యవర్గ ఎన్నికలకు సంబంధించి శనివారం నామినేషన్ల ప్రక్రియ విజయవంతంగా ముగిసింది. సొసైటీ భవనంలో ఉదయం 10:00 గంటల నుండి మధ్యాహ్నం 12:00 గంటల వరకు అభ్యర్థుల నుండి నామినేషన్లను స్వీకరించారు.

అధ్యక్ష పదవికి ముగ్గురి పోటీ సొసైటీ అధ్యక్ష పదవి కోసం తిప్పవరం రవీందర్, రేవోజు ప్రవీణ్ మరియు అలువాల ప్రసాదులు నామినేషన్లు దాఖలు చేశారు. ప్రధాన కార్యదర్శి పదవికి కాంభోజ శ్రీనివాస్ మరియు గోకుల కొండ శ్రీధర్ పోటీలో ఉన్నారు. కోశాధికారి పదవికి బాసన్ పెళ్లి శ్యామసుందర్ ఒక్కరే నామినేషన్ దాఖలు చేశారు. ఆయనకు వ్యతిరేకంగా ఎవరూ పోటీలో లేకపోవడంతో, శ్యామసుందర్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి అధికారికంగా ప్రకటించారు. ఈ ఎన్నికల ప్రక్రియ అంతా ఎన్నికల అధికారి శ్రీరాముల వేణుగోపాల చారి పర్యవేక్షణలో నిర్వహించబడింది. సహాయకులుగా చెలిమెల రామస్వామి, విశ్వనాథుల చంద్రమౌళి వ్యవహరించారు. నామినేషన్ల స్వీకరణ అనంతరం ఎన్నికల అధికారి మాట్లాడుతూ.. సొసైటీ నిబంధనల ప్రకారం ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించబడుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సభ్యులు మరియు కార్పెంటర్ వృత్తిదారులు పాల్గొన్నారు.



## అయ్యప్ప స్వామి గుడి బోర్‌వెల్‌ను ప్రారంభించిన సర్పంచ్ ఎం.రాజు

**బలగం టీవీ, ఇల్లంతకుంట:**

ఇల్లంతకుంట మండల కేంద్రంలోని అయ్యప్ప స్వామి దేవాలయం ప్రాంగణంలో భక్తుల, స్థానిక ప్రజల తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని నూతనంగా ఏర్పాటు చేసిన బోర్‌వెల్‌కు మోటార్ అమర్చి గ్రామ సర్పంచ్ ఎం. రాజు కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు.

ఈ సందర్భంగా సర్పంచ్ ఎం. రాజు మాట్లాడుతూ.. దేవాలయానికి వచ్చే భక్తులకు తాగునీటి సౌకర్యం కల్పించడం గ్రామపంచాయతీ ప్రాధాన్యత కింద చేపట్టిన కార్యక్రమమని తెలిపారు. గ్రామ అభివృద్ధి దిశగా మరిన్ని మౌలిక వసతుల ఏర్పాటుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్, గ్రామ పురోహితులు మూగు నాగరాజు శర్మ, యువజన సంఘాల అధ్యక్షులు రేగుల కార్తీక్, వార్డు సభ్యులు రాకం సుమన్, అంతటి శ్రీకాంత్, నాయకులు ఎర్రోజు గోపాల చారి, మోహన్ రెడ్డి, కొట్టె వెంకటి, ముంజ భూపతి, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎర్రోజు సంతోష్, యాస నిఖిల్, కారోబర్ నర్సయ్య, రామచంద్రం, బాబు, చంద్ పాషా, దేవాలయ కమిటీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



## వాణినికేతన్ హైస్కూల్‌లో ఘనంగా సైన్స్ దినోత్సవ వేడుకలు..

**బలగం టీవీ, ఇల్లంతకుంట:**

ఇల్లంతకుంట మండల కేంద్రంలోని వాణినికేతన్ హై స్కూల్ లో సైన్స్ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా పాఠశాల ఆవరణలో విద్యార్థులు తయారుచేసి తీసుకుని వచ్చిన సైన్స్ ప్రాజెక్టులను ప్రదర్శించారు.

ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ తూముకుంట శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. సివి రామన్ కాంతి కిరణాలపై పరిశోధన చేసి భారతదేశానికి మొదటి నోబెల్ ప్రైజ్ సాధించిన రామన్ ఎఫెక్ట్ కనుగొన్న రోజు ఫిబ్రవరి 28 అని ఈరోజును జాతీయ సైన్స్ దినోత్సవముగా జరుపుకుంటున్నామని పేర్కొన్నారు. ప్రతి విద్యార్థి సైన్స్ పట్ల ఆసక్తిని పెంచుకోవాలని సూచించారు. సైన్స్ లేని ప్రపంచాన్ని మనం ఊహించలేమన్నారు. శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవడం వల్ల విద్యార్థుల భవిష్యత్తు బంగారుమయం అవుతుందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన ఉత్తమ ప్రాజెక్టులకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీనిధి. ఉపాధ్యాయులు శ్రీనివాస్. రాజు, రమేష్, సంతోష్, తిరుపతి, రాజు, సుమంగళి, శోభ, రేఖ, మహాలక్ష్మి, లావణ్య, సునంద, మౌనిక, కళ్యాణి, షమీమా, రేణుక, జలజ, శాంత, పద్మ, స్వాతి, రేణుక, సునీత లతోపాటు విద్యార్థులు పాల్గొన్నారు.

# చిన్నతనం నుండే పరిశోధన మనస్తత్వం అలవర్చాలి

- **రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్**
- **కృష్ణవేణి టాలెంట్ స్కూల్, వాణి విద్యాలయంలో సైన్స్ ఫెయిర్**

**బలగం టీవీ, వేములవాడ:**



విద్యార్థులు చిన్నతనం నుంచే పరిశోధనా మనస్తత్వాన్ని పెంపొందించుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. శనివారం జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా వేములవాడ పట్టణంలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్, వాణి విద్యాలయంలో సైన్స్ ఫెయిర్‌ను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సైన్స్ ప్రదర్శనలను ఆయన సందర్శించి విద్యార్థుల ప్రతిభను ప్రశంసించారు. విద్యార్థులు రూపొందించిన శాస్త్రీయ నమూనాలు, పర్యావరణ పరిరక్షణకు సంబంధించిన ప్రాజెక్టులు, ఆధునిక సాంకేతికత మోడళ్లను ఆసక్తిగా పరిశీలించారు. ప్రతి స్టాల్ వద్ద ఆగి విద్యార్థులతో మాట్లాడి వారి ఆలోచనా విధానాన్ని తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరమని అన్నారు. భవిష్యత్తులో దేశ అభివృద్ధికి శాస్త్ర సాంకేతిక రంగం కీలకమని, చిన్ననాటి నుంచే పరిశోధనా మనస్తత్వం అలవర్చుకోవాలని సూచించారు.

శాస్త్రీయ దృక్పథం ప్రతి విద్యార్థి జీవితంలో భాగమవ్వాలని, ప్రశ్నించే స్వభావం పెంపొందించుకోవాలని సూచించారు. సైన్స్ అనేది పుస్తకాలకే పరిమితం కాకుండా, దైనందిన జీవితంలో సమస్యలకు పరిష్కారాలు కనుగొనే సాధనమని అన్నారు.రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగ అభివృద్ధికి కట్టుబడి ఉందని, గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు కూడా జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించాలనే లక్ష్యంతో పనిచేస్తోందని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం ఏర్పడిన వెంటనే విద్యార్థులకు డైట్ చార్జీలో కాస్మోటిక్ చార్జీలను పెంచి విద్యార్థులకు పౌష్టిక ఆహారం అందించడం జరుగుతుందని అన్నారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యాశాఖను వారి వద్ద ఉంచుకొని విద్యా విధానంలో సమూల మార్పులు తీసుకువస్తున్నారని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు సరిపడా టీచర్ల నియామకాన్ని ముఖ్యమంత్రి డీఎస్సీ ద్వారా నియమించారని, 200 కోట్లతో తెలంగాణ రాష్ట్రంలో ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్లను ఏర్పాటు చేస్తున్నారని పేర్కొన్నారు..విద్య కమిషన్ చైర్మన్ మూడు రోజుల క్రితం దేశంలో వివిధ రాష్ట్రాల్లో పర్యటించి విద్యా విధానంలో మార్పులకు పలువురు సూచనలు తీసుకొని ఒక నివేదిక రాష్ట్ర ప్రభుత్వానికి అందజేసినట్లు తెలిపారు.

# రైతుబంధు తక్షణ విడుదల కోరుతూ వినతిపత్రం



- **ఎల్లంపల్లి నీటి విడుదలకూ డిమాండ్..**
- **రైతు సంక్షేమ సంఘం మండల శాఖ అధ్యక్షులు, మాజీ ఎంపీపీ చందుర్తి చిలుక పెంటయ్య**

**బలగం టీవీ, చందుర్తి**

చందుర్తి మండల కేంద్రంలో రైతు సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో స్థానిక డిప్యూటీ తహసీల్దార్ కి వినతిపత్రం సమర్పించారు. రైతులకు రావలసిన రైతుబంధు నిధులను తక్షణమే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

గత ప్రభుత్వ హయాంలో అప్పటి మాజీ ముఖ్యమంత్రి కే. చంద్రశేఖర్ రావు రైతుల బాధలను దృష్టిలో పెట్టుకుని రైతుబంధు పథకాన్ని సమయానికి విడుదల చేసిన విషయాన్ని గుర్తు చేశారు. అయితే ప్రస్తుత ప్రభుత్వం ఏర్పడి మూడు సంవత్సరాలు పూర్తవుతున్నప్పటికీ రెండు సీజన్ల రైతుబంధు బకాయిలు ఇంకా చెల్లించలేదని, మూడో విడతపై కూడా స్పష్టత లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

మున్సిపల్ ఎన్నికల సమయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేస్తామని హామీ ఇచ్చి, అనంతరం సంక్రాంతి నాటికి ఇస్తామని చెప్పినా ఇప్పటివరకు అమలు కాలేదని తెలిపారు. ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలు అమలు కావాలని, రైతులతో అబద్ధాలు ఆడడం తగదని అన్నారు. వెంటనే రైతుబంధు నిధులు విడుదల చేసి రైతులను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. అలాగే ప్రస్తుతం వరి పొలాలు పొట్ట దశలో ఉన్నందున ఎల్లంపల్లి శ్రీపాద ప్రాజెక్ట్ నుంచి నీరు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. మండలంలోని చెరువులన్నీ నీటితో నింపేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరుతూ స్థానిక తహసీల్దారు ద్వారా వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంక్షేమ సంఘం గ్రామ శాఖ అధ్యక్షులు మర్రి రాజు, మోత్కుపల్లి దేవయ్య, మర్రి చిన్నరాజు, ఎన్. రవీందర్ రెడ్డి, పోతరాజు తిరుపతి, బొల్లు వెంకటి, లింగంపల్లి అంజయ్య, మరి రాములు, ఎండి సమీర్, మాజీ సర్పంచ్ రమేష్ (కిష్టంపేట), మరి మల్లయ్య, తిప్పన్నరసయ్య తదితర రైతులు పాల్గొన్నారు.

# మాలల అస్తిత్వం కోసం పోరాడుతాం..

- **ఎస్సీ వర్గీకరణతో మాలలకు అన్యాయం.. కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెబుతాం..**
- **మాల సంఘాల జేఏసీ చైర్మన్ మందాల భాస్కర్**

**బలగం టీవీ, హన్మకొండ:**

ఎస్సీ వర్గీకరణ కారణంగా గత పది నెలలుగా మాల సామాజిక వర్గం, విద్యార్థులు, నిరుద్యోగులు మరియు ఉద్యోగులు తీవ్రంగా నష్టపోతున్నారని మాల సంఘాల జేఏసీ ఆవేదన వ్యక్తం చేసింది. హన్మకొండలో మాల సంఘాల జేఏసీ మరియు మాల స్టూడెంట్ జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రతినిధుల సమావేశంలో వరంగల్ జిల్లా అడ్హక్ (యూఎస్ఫ్రశీఎ) కమిటీని ఏకగ్రీవంగా నియమించారు.

ఈ సందర్భంగా మాల సంఘాల జేఏసీ చైర్మన్ మందాల భాస్కర్, మాల స్టూడెంట్ జేఏసీ చైర్మన్ మాదాసు రాహుల్ రావు, చైర్మన్ చెరుకు రామచందర్ మాట్లాడుతూ.. ప్రస్తుత రోస్టర్ పాయింట్ల విధానం వల్ల మాలలకు జరుగుతున్న అన్యాయాన్ని వివరించారు. తెలంగాణలో మాల సామాజిక వర్గానికి రాజకీయంగా, సామాజికంగా నష్టం చేకూర్చిన కాంగ్రెస్ పార్టీ తీరును నిరసిస్తూ, భవిష్యత్తులో ఆ పార్టీకి తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. రాబోయే రోజుల్లో తమ సామాజిక, ఆర్థిక, రాజకీయ ప్రాతినిధ్యాన్ని సాధించుకోవడమే లక్ష్యంగా పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని స్పష్టం చేశారు.

అనంతరం, నాయకులు కాకతీయ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్‌ను




కలిసి విద్యార్థుల సమస్యలపై వినతిపత్రం సమర్పించారు. ముఖ్యంగా ఇటీవల విడుదలైన పార్ట్ టైమ్ లెక్చరర్ల నోటిఫికేషన్‌లో రోస్టర్ పాయింట్ల అమలులో జరిగిన అవకతవకలను వీసీ దృష్టికి తీసుకెళ్లారు. ఎస్సీ వర్గీకరణ వల్ల యూనివర్సిటీ స్థాయిలోనే మాల విద్యార్థులు అవకాశాలు కోల్పోతున్నారని, ఈ విషయంలో న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా నాయకులు బండి అశోక్, దండు మోహన్, అసిస్టెంట్ ప్రొఫెసర్ కర్రే సదాశివ్, జెట్టి రాజేందర్, బండి రజినిష్, దండ్రి శ్రీనివాస్, గుండు రాజేష్, సంతోష్, బత్తుల రమేష్, బత్తుల దిలీప్ మరియు కాకతీయ యూనివర్సిటీ మాల విద్యార్థులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# పారిశుధ్యం, నీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి



**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

సిరిసిల్ల పట్టణ ప్రజలకు మెరుగైన పారిశుద్య వాతావరణం, తాగునీటి సరఫరా అందించడంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ తెలిపారు. శుక్రవారం సిరిసిల్ల పురపాలక సంఘ కార్యాలయంలో చైర్‌పర్సన్ అధ్యక్షతన సాధారణ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. మొత్తం 12 అంశాలతో నిర్వహించిన ఈ సమావేశంలో అన్ని తీర్మానాలు ఏకగ్రీవంగా ఆమోదం పొందాయి. పట్టణ అభివృద్ధి, పారిశుధ్యం, నీటి సరఫరా, స్ట్రీట్‌లైట్స్ నిర్వహణ తదితర అంశాలపై కీలక నిర్ణయాలు తీసుకున్నారు.

సిరిసిల్ల పట్టణంలోని నెహ్రూ నగర్, విద్యానగర్ తదితర ప్రాంతాల్లో గల వైకుంఠ దామాల నిర్వహణలో భాగంగా రూ.101కు దహన సంస్కారాలు నిర్వహించే విధానాన్ని పునరుద్ధరించారు. ఇందుకు సంబంధించిన ఖర్చుల కోసం సంవత్సరానికి రూ.16.80 లక్షలు కేటాయిస్తూ పరిపాలనపరమైన నిధులు మంజూరు చేశారు.పట్టణ పారిశుద్యాన్ని మెరుగుపర్చేందుకు వార్డుల వారీగా ప్రత్యేక సానిటేషన్ డ్రైవ్ కార్యక్రమం చేపట్టేందుకు రూ.10 లక్షలు, రాబోయే వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని వివిధ వార్డుల్లోని పవర్ బోర్ల నిర్వహణకు రూ.10 లక్షలు,స్ట్రీట్ లైట్స్ నిర్వహణకు అవసరమైన సామగ్రి కొనుగోలుకు రూ.5 లక్షలు, వాహనాలైన ట్రాక్టర్లు, బ్లేడ్ ట్రాక్టర్లు, ఆటోలు, జెసిబిల మరమ్మతులకు రూ.11.20 లక్షలు కేటాయించారు.రంజాన్ పండుగ సందర్భంగా పట్టణంలోని మసీదులు, ఈద్గాల వద్ద టెంట్లు, లైటింగ్, గ్రీన్ మ్యాట్లు, త్రాగునీటి వంటి మౌలిక వసతుల కల్పనకు రూ.3 లక్షలు మంజూరు చేశారు. పట్టణ ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా ఈ నిర్ణయాలు తీసుకున్నట్లు చైర్‌పర్సన్ జిందం కళ తెలిపారు. ఈ సమావేశంలో వైస్ చైర్మన్, వార్డు సభ్యులు, మున్సిపల్ కమిషనర్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, టౌన్ ప్లానింగ్ అధికారులు, అసిస్టెంట్ ఇంజనీర్, అకౌంట్స్ అధికారి, రెవెన్యూ అధికారి, సానిటరీ ఇన్స్పెక్టర్ తదితర సిబ్బంది పాల్గొన్నారు.



## వేములవాడ రాజన్న ఆలయ అధికారికి ఘన వీడ్కోలు

**బలగం టీవీ, వేములవాడ:**

రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలోని శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానంలో సహాయ కార్యనిర్వహణాధికారి బ్రహ్మన్నగారి శ్రీనివాస్ శనివారం పదవీ విరమణ పొందిన సందర్భంగా వేములవాడలోని భీమేశ్వర సదన్లో ఘనంగా వీడ్కోలు సమావేశం నిర్వహించగా,సమావేశానికి అధ్యక్షులుగా కూరగాయల శ్రీనివాస్ వ్యవహరించారు. ఆలయం తరపున శ్రీనివాస్ గారికి స్వామివారి శేషవస్త్రం, లడ్డు ప్రసాదం మరియు స్వామివారి చిత్రపటము అందజేశారు. ఆలయ అర్చకులు, వేద పండితులు ఆశీర్వచనాలు అందజేశారు. అనంతరం ఆలయ ఉద్యోగులు శాలువాతో సత్కరించినారు. అలాగే, వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో విధులు నిర్వర్తిస్తూ, యాదగిరిగుట్టలో పర్యవేక్షకులుగా సేవలందించిన కాంచనపల్లి నటరాజు కూడా పదవీ విరమణ పొందిన సందర్భంగా వారి సేవలను కొనియాడారు. ఇక్కడ టి.ఎన్.జి.ఓస్ స్పెషల్ యూనిట్, మినిస్టీరియల్ మరియు నాలుగవ తరగతి సిబ్బంది యూనియన్ సభ్యులు, ఆలయ ఉద్యోగులు, వేద పండితులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

# స్పష్టమైన చూపు- సురక్షిత డ్రైవింగ్‌కు కీలకం..

- ముందస్తు జాగ్రత్తలు పాటిస్తే రోడ్డు ప్రమాదాలను గణనీయంగా నివారించవచ్చు.
- ప్రతి వాహనదారుడు క్షేమంగా తమ గమ్యస్థానాలకు చేరుకోవాలనే లక్ష్యంతోనే అరైవ్-అలైవ్ కార్యక్రమం.
- జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే
- సిరిసిల్ల,వేములవాడ పోలీసుల ఆధ్వర్యంలో డ్రైవర్లకు ఉచిత కంటి పరీక్షలు



**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

స్పష్టమైన దృష్టి,నియంత్రిత వేగం,ట్రాఫిక్ నిబంధనల పాటింపు ద్వారా ప్రమాదాలను గణనీయంగా నివారించి సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవచ్చని జిల్లా ఎస్పీ తెలిపారు. శనివారం సిరిసిల్ల, వేములవాడ పోలీసుల ఆధ్వర్యంలో కాత్యాయని,ఎల్.వి ప్రసాద్ హాస్పిటల్స్ సిరిసిల్ల,లయన్స్ క్లబ్ ఆఫ్ వేములవాడ, మాతృ శ్రీ ,శ్రీ వర్ష కంటి హాస్పిటల్స్ వేములవాడ వారి సహకారంతో డ్రైవర్లకు ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరాలను ప్రారంభించి,పరీక్షల అనంతరం అవసరమైన వారికి జిల్లా ఎస్పీ గారు కంటి అద్దాలు అందజేశారు.

ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదాల నివారణే ప్రధాన లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అరైవ్–అలైవ్ కార్యక్రమంలో భాగంగా సిరిసిల్ల,వేములవాడ పట్టణాల్లో డ్రైవర్లకు ఉచిత కంటి వైద్య పరీక్షల శిబిరాన్ని ఏర్పాటు చేశామని,రోడ్డు ప్రమాదాల నివారణలో డ్రైవర్ల పాత్ర కీలకమన్నారు. వయస్సు పెరిగే కొద్ది కంటి చూపు మందగించడం సహజమని, ముఖ్యంగా ప్రజలను తరలించే ప్యాసింజర్ వాహనాలకు చెందిన డ్రైవర్లు తమ కంటి చూపుపై మరింత శ్రద్ధ వహించాలని, పబ్లిక్ ట్రాన్స్‌పోర్టు వాహనాల్లో ప్రయాణించే ప్రయాణికులను వారి గమ్య స్థాలను క్షేమంగా చేరవేయాల్సిన బాధ్యత డ్రైవర్లపై వుందన్నారు.

ముఖ్యంగా కంటి చూపుతో బాధపడే వారు వాహనం నడపడం ద్వారా రోడ్డు ప్రమాదాలు జరిగే అస్కారం అధికమని, రోడ్డు ప్రమాదాల నివారణకై డ్రైవర్లు సైతం నిరంతం కంటి పరీక్షలు నిర్వహించుకోవడం క్షేమకరమన్నారు. వాహనం నడిపేటప్పుడు ట్రాఫిక్ మరియు రోడ్డు భద్రత నియమాలు తప్పక పాటించాలని,ద్విచక్ర వాహనం నడిపే సందర్భాల్లో తప్పక హెల్మెట్ ధరించాలని, మద్యం సేవించి డ్రైవింగ్ చేయడం, ఓవర్ స్పీడ్, ఓవర్ లోడింగ్, ర్యాష్ డ్రైవింగ్,సెల్ ఫోన్ డ్రైవింగ్ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఈ సందర్భంగా కాత్యాయని,ఎల్ వి ప్రసాద్ హాస్పిటల్స్ సిరిసిల్ల వారికి ,లయన్స్ క్లబ్ ఆఫ్ వేములవాడ ,మాతృ శ్రీ హాస్పిటల్, శ్రీ వర్ష కంటి హాస్పిటల్స్ వేములవాడ వారికి జిల్లా ఎస్పీ కృతజ్ఞతలు తెలిపారు. ఎస్పీ వెంట వేములవాడ ఏఎస్పీ రుత్విక్ సాయి, డిఎస్పీ నాగేంద్రచారి, ఇన్స్పెక్టర్ లు కృష్ణ,వీరప్రసాద్, ఎస్.ఐ లు,డాక్టర్ చికోటి సంతోష్, లయన్స్ క్లబ్ సిబ్బంది, డ్రైవర్లు పాల్గొన్నారు.



## బీసీ సంక్షేమానికి 60 వేల కోట్లు కేటాయించాలి..

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల :**

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టనున్న బడ్జెట్లో బీసీ సంక్షేమానికి 60 వేల కోట్లు కేటాయించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం యూత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శీలం స్వామి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ముస్తాబాద్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శీలం స్వామి మాట్లాడుతూ రాష్ట్ర బడ్జెట్‌లో బీసీలకు 60 వేల కోట్లు కేటాయించి, బీసీ సబ్ ప్లాన్ వెంటనే అమలు చేయాలంటూ డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీ ప్రకారం బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించి, ఐదేళ్లలో ఒక లక్ష కోట్ల బడ్జెట్‌ను బీసీల సంక్షేమానికి కేటాయించాలని, గత సంవత్సరాల కేటాయింపులు తగిన విధంగా ఉపయోగించబడలేదని తెలిపారు. బీసీ స్టడీ సర్కిల్‌లు, గురుకులాలు, ప్రత్యేక పాఠశాలలు, బీసీ కార్పొరేషన్లు, ప్రోత్సాహకాలు పల్లెల్లో, పట్టణాల్లో ఏర్పాటు చేయాలి. నిరుద్యోగ యువతకు ఉపాధి మార్గాలు చూపించాలని, లేకపోతే బీసీ సంఘాలు ప్రభుత్వంపై పోరాటానికి సిద్ధమవుతాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీసీ నాయకులు జాల బిక్షపతి, పుల్లూరి రవి, బద్ద వెంకటి, మోతే నర్సింలు, బద్ద నాంపెల్లి, నీరటి శేఖర్ పాల్గొన్నారు.

# కువైట్‌లో మోగిన సైరన్లు.. భారీ పేలుళ్ల శబ్దాలతో ప్రజల ఆందోళన..



**బలగం టీవీ, కువైట్ సిటీ:**

కువైట్‌లో శనివారం మధ్యాహ్నం ఒక్కసారిగా ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. దేశవ్యాప్తంగా అత్యవసర హెచ్చరిక సైరన్లు మోగడంతో పాటు గగనతలంలో భారీ పేలుళ్ల శబ్దాలు వినిపించాయని ప్రత్యక్ష సాక్షులు వెల్లడించారు. ఈ పరిణామం స్థానికులు మరియు ప్రవాసీయుల్లో తీవ్ర ఆందోళనకు దారితీసింది.

అత్యవసర పరిస్థితుల్లో ప్రజలను అప్రమత్తం చేసేందుకు వినియోగించే హెచ్చరిక సైరన్లు కువైట్‌లోని పలు ప్రాంతాల్లో వినిపించాయి. సైరన్ల మోగింపుతో ప్రజలు భయాందోళనలకు గురయ్యారు. పలువురు సోషల్ మీడియా వేదికగా గగనతలంలో పేలుళ్లు జరిగినట్లు భారీ శబ్దాలు వినిపించాయని పేర్కొన్నారు. అయితే ఈ పేలుళ్లకు గల ఖచ్చితమైన కారణా లపై ఇంకా స్పష్టత రాలేదు. ఇప్పటికే ఇరాన్ గగనతలం మూసివేత, విమానాల రద్దుతో ప్రాంతీయ ఉద్రిక్తతలు నెలకొన్న నేపథ్యంలో ఈ సంఘటన చోటుచేసుకోవడం ప్రాధాన్యత సంతరించుకుంది. పరిస్థితిని భద్రతా దళాలు సమీక్షిస్తున్నాయి. ప్రస్తుతం పేలుళ్లకు గల కారణాలపై అధికారిక ధృవీకరణ వెలువడాల్సి ఉంది. ప్రజలు ఎవరూ భయాందోళనలకు గురికావద్దని, కేవలం అధికారిక ప్రకటనలను మాత్రమే విశ్వసించాలని అధికారులు విజ్ఞప్తి చేశారు. పరిస్థితిని పర్యవేక్షిస్తూ అవసరమైన భద్రతా చర్యలు చేపట్టినట్లు తెలిపారు.

**కువైట్ గగనతలంలో క్షిపణుల కలకలం: గాలిలోనే కూల్చివేసిన ఆర్మీ!**

ప్రాంతీయ ఉద్రిక్తతల నేపథ్యంలో కువైట్ రక్షణ వ్యవస్థ అప్రమత్తమైంది. శనివారం కువైట్ గగనతలంలోకి దూసుకొచ్చిన కొన్ని క్షిపణులను తమ వైమానిక రక్షణ వ్యవస్థలు విజయవంతంగా అడ్డుకుని, గాలిలోనే కూల్చివేసినట్లు కువైట్ ఆర్మీ జనరల్ స్టాఫ్ అధికారికంగా ప్రకటించింది.దేశ రక్షణ కోసం మోహరించిన అత్యాధునిక ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్స్ సకాలంలో స్పందించి ముప్పును తప్పించాయి. ఈ ఘటన నేపథ్యంలో సరిహద్దుల వెంబడి మరియు కీలక ప్రాంతాల్లో సైన్యం నిఘాను మరింత కఠినతరం చేసింది. దేశ రక్షణ విషయంలో ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, సైన్యం పూర్తి స్థాయిలో సిద్ధంగా ఉందని జనరల్ స్టాఫ్ భరోసా ఇచ్చింది. కువైట్ గగనతలం సురక్షితంగా ఉందని, పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తున్నామని ఆర్మీ వర్గాలు వెల్లడించాయి



## నారాయణ పాఠశాలలో ఘనంగా జాతీయ విజ్ఞాన దినోత్సవం...

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

స్థానిక విద్యానగర్‌లోని నారాయణ హైస్కూల్‌లో "జాతీయ విజ్ఞాన దినోత్సవం" వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా విద్యార్థులు ఏర్పాటు చేసిన సైన్స్ ఎగ్జిబిషన్ సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంది. ఈ ప్రదర్శనలో విద్యార్థులు తమ మేధస్సుకు పదును పెట్టి రూపొందించిన పలు నమూనాలు వారి సృజనాత్మకతకు అద్దం పట్టాయి.రోబోటిక్ అబ్ స్టకిల్ కారు, అబ్ స్టకిల్ ఆబ్జెక్టివ్. న్యూటన్ గమన నియమాల వివరణ. మానవ విసర్జక వ్యవస్థ, రక్త ప్రసరణ వ్యవస్థ, గుండె, కాలేయం వంటి ప్రధాన అవయవాల పనితీరు.కాలుష్య నివారణ మార్గాలు, ఆమ్ల వర్షాల ప్రభావం, కార్బోహైడ్రేట్ల నిర్ధారణ పరీక్షలు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన పట్టణ మున్సిపల్ చైర్మన్ శ్రీమతి జిందం కళాచక్రపాణి గారు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రదర్శనను ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. "విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మక శక్తిని, ప్రతిభను వెలికి తీయడానికి ఇటువంటి విజ్ఞాన ప్రదర్శనలు ఒక చక్కని వేదిక" అని కొనియాడారు. విద్యార్థులు శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకుని భవిష్యత్తులో గొప్ప శాస్త్రవేత్తలుగా ఎదగాలని ఆమె ఆకాంక్షించారు. ఈ వేడుకలో నారాయణ పాఠశాలల ఏజీఎం అన్నం చైతన్య రావు, ఆర్ఐ చీటీ సత్యం రావు, ప్రధానోపాధ్యాయులు మదన శాంతి కిరణ్, డీన్ నవీన్ కుమార్, అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ రాజేశం, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు మరియు తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. తమ పిల్లల ప్రదర్శనలను చూసి తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.

# ప్రపంచకప్ నుంచి పాకిస్థాన్ ఔట్

- శ్రీలంకపై 5 పరుగుల తేడాతో గెలిచినా ఫలితం లేకుండా పోయింది
- గ్రూప్-2 నుంచి న్యూజిలాండ్‌కు బెర్త్



**బలగం టీవీ, పల్లెకెలె**

ప్రపంచకప్ నుంచి పాకిస్థాన్ నిష్క్రమించింది. సూపర్-8 దశలో భాగంగా శనివారం పల్లెకెలె వేదికగా జరిగిన కీలక మ్యాచ్‌లో శ్రీలంకపై 5 పరుగుల తేడాతో విజయం సాధించినప్పటికీ, రన్‌రేట్ లోటుతో పాకిస్థాన్ టోర్నీ నుంచి నిష్క్రమించింది. గ్రూప్-2 నుంచి న్యూజిల్యాండ్ మెరుగైన రన్‌రేట్ ఆధారంగా సెమీఫైనల్ బెర్త్ ఖరారు చేసుకుంది.

సెమీస్ ఆశలు సజీవంగా ఉంచుకోవాలంటే భారీ తేడాతో గెలవాల్సిన మ్యాచ్‌లో పాకిస్థాన్ బ్యాటర్లు విరుచుకుపడ్డారు. ఓపెనర్లు షాహిబ్జాదా ఫర్హాన్ (60 బంతుల్లో 100; 9 ఫోర్లు, 5 సిక్సులు), ఫకార్ జమాన్ (42 బంతుల్లో 84; 9 ఫోర్లు, 4 సిక్సులు) తొలి వికెట్‌కు 176 పరుగుల అద్భుత భాగస్వామ్యం నెలకొల్పారు. నిర్ణీత 20 ఓవర్లలో పాకిస్థాన్ 8 వికెట్ల నష్టానికి 212 పరుగుల భారీ స్కోరు నమోదు చేసింది. అయితే మిడిల్ ఆర్డర్ బ్యాటర్లు విఫలమవడంతో 230 పైగా స్కోరు చేసే అవకాశాన్ని కోల్పోయింది.

బౌలింగ్‌లోనూ పాకిస్థాన్ మెరుగైన ఆరంభం అందుకుంది. నసీమ్ షా, అబ్రార్ అహ్మద్ (3/23), మహమ్మద్ నవాజ్ ధాటికి శ్రీలంక 101 పరుగులకే 5 వికెట్లు కోల్పోయింది. అయితే ఆ దశలో మ్యాచ్ పూర్తిగా పాకిస్థాన్ పక్షాన ఉన్నప్పటికీ, శ్రీలంక బ్యాటర్లు పవన్ రత్నాయకే (37 బంతుల్లో 58; 4 ఫోర్లు, 3 సిక్సులు), డసన్ షనక అద్భుత ప్రతిఘటనతో మ్యాచ్‌ను ఉత్కంఠభరితంగా మార్చారు. ప్రధాన స్పిన్నర్ ఉస్మాన్ తారిక్ (0/43) నిరాశపరిచాడు. చివరికి నిర్ణీత 20 ఓవర్లలో శ్రీలంక 6 వికెట్ల నష్టానికి 207 పరుగులు మాత్రమే చేయగలిగింది. 5 పరుగుల తేడాతో ఓటమి పాలైనప్పటికీ, పోరాట పటిమతో అభిమానుల ప్రశంసలు అందుకుంది. అయితే 147 పరుగుల లోపు శ్రీలంకను కట్టడి చేయడంలో విఫలమైన పాకిస్థాన్ సెమీస్ అవకాశాలను కోల్పోయి టోర్నీకి వీడ్కోలు పలికింది.



# విజయ్-రష్మికలకు ప్రత్యేక సర్‌ప్రైజ్

- రణబాలి నుంచి 'ఎందయ్య సామి' గీతం విడుదల
- సెప్టెంబర్ 11న చిత్రం విడుదల

**బలగం టీవీ, హైదరాబాద్**

టాలీవుడ్‌లో కొత్త జంటగా నిలిచిన విజయ్ దేవరకొండ, రష్మిక మందనలకు చిత్రబృందం ప్రత్యేక సర్‌ప్రైజ్ ఇచ్చింది. రణబాలి చిత్రంలో ఈ జంట ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. రాహుల్ సంకృత్యన్ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ ప్రతిష్టాత్మక చిత్రంలో విజయ్ 'రణబాలి'గా, రష్మిక 'జయమ్మ'గా కనిపించనున్నారు.ఇటీవల వివాహబంధంలోకి అడుగుపెట్టిన ఈ జంటకు శుభాకాంక్షల సూచికగా చిత్రంలోని రొమాంటిక్ మెలోడీ "ఎందయ్య సామి" గీతాన్ని విడుదల చేశారు. ప్రముఖ సంగీత ద్వయం అజయ్-అతుల్ స్వరపరిచిన ఈ పాట వినగానే ఆకట్టుకునేలా ఉందని అభిమానులు అభిప్రాయపడుతున్నారు. తెలుగుతో పాటు తమిళం, హిందీ సహా మొత్తం ఐదు భాషల్లో ఈ గీతాన్ని విడుదల చేయడం విశేషం.

పాటలో విజయ్--రష్మికల మధ్య కనిపించిన కెమిస్ట్రీ గతంలో వచ్చిన గీత గోవిందం చిత్రాన్ని గుర్తు చేస్తోందని అభిమానులు సామాజిక మాధ్యమాల్లో కామెంట్లు చేస్తున్నారు. చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్ అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తోంది. అలాగే హాలీవుడ్ నటుడు ఆర్నాల్డ్ వోస్లూ (మమ్మీ ఖ్యాతి) కీలక పాత్రలో నటించడం ఈ చిత్రానికి ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. సెప్టెంబర్ 11న ప్రపంచవ్యాప్తంగా ఈ చిత్రాన్ని విడుదల చేయనున్నట్లు చిత్రబృందం వెల్లడించింది.

# 'మృత్యుంజయ' ట్రైలర్ విడుదల

- శ్రీవిష్ణు పవర్‌ఫుల్ పాత్రపై భారీ అంచనాలు

**బలగం టీవీ, హైదరాబాద్**




టాలీవుడ్ వెర్సటైల్ నటుడు శ్రీవిష్ణు, రెబా మోనికా జాన్ జంటగా నటిస్తున్న మృత్యుంజయ చిత్ర ట్రైలర్ తాజాగా విడుదలై ప్రేక్షకుల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఇన్వెస్టిగేటివ్ క్రైమ్ థ్రిల్లర్‌గా రూపొందిన ఈ చిత్ర ట్రైలర్‌ను 'మ్యాన్ ఆఫ్ మాసెస్'గా గుర్తింపు పొందిన జూనియర్ ఎన్టీఆర్ డిజిటల్ వేదికగా విడుదల చేసి చిత్ర యూనిట్‌కు శుభాకాంక్షలు తెలిపారు. శ్రీ హుస్సేన్ షా కిరణ్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రంలో శ్రీవిష్ణు ఓ ప్రత్యేక పాత్రలో కనిపించనున్నారు. క్రైమ్ బ్యూరోలో ఉద్యోగం దక్కకపోయినా, తన ప్రతిభతో క్లిష్టమైన మిస్టరీని ఛేదించే ఇన్వెస్టిగేటివ్ అధికారిగా ఆయన పాత్ర ఉండనుందని ట్రైలర్ సూచిస్తోంది. గురు సుకుమార్ శిష్యుడిగా కిరణ్ తన ప్రతిభను ఈ చిత్రంతో చాటుకోవాలని ప్రయత్నిస్తున్నాడు. ఇప్పటికే సామజవరగమన వంటి విజయవంతమైన చిత్రం తర్వాత శ్రీవిష్ణు -- రెబా మోనికా జాన్ కాంబినేషన్‌లో వస్తున్న రెండో సినిమా కావడంతో ఈ ప్రాజెక్ట్‌పై మంచి అంచనాలు నెలకొన్నాయి. సంగీతాన్ని కాళ భైరవ అందించగా, ప్రముఖ ఎడిటర్ శ్రీకర్ ప్రసాద్ సాంకేతిక నైపుణ్యం సినిమాకు ప్రధాన బలం కానుంది. ఇటీవల విష్ణు విన్యాసంతో విజయాన్ని అందుకున్న శ్రీవిష్ణు, మార్చి 6న 'మృత్యుంజయ' ద్వారా మరోసారి ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమయ్యారు. సందీప్ గుణ్ణం, వినయ్ చిలకపాటి నిర్మించిన ఈ చిత్రం సస్పెన్స్ థ్రిల్లర్ అభిమానులకు కొత్త అనుభూతిని అందిస్తుందని చిత్రబృందం ధీమా వ్యక్తం చేస్తోంది.

# 67 ఏళ్ల నిరీక్షణకు తెర

## రంజీ ట్రోఫీని తొలిసారి ముద్దాడిన జమ్మూ కశ్మీర్



**బలగం టీవీ, హైదరాబాద్**

భారత దేశవాళీ క్రికెట్‌లో రంజీ చరిత్రలో జమ్మూ కశ్మీర్ సరికొత్త అధ్యాయాన్ని లిఖించింది. 67 ఏళ్ల సుదీర్ఘ నిరీక్షణకు తెరదించుతూ తొలిసారి ప్రతిష్టాత్మక రంజీ ట్రోఫీని కైవసం చేసుకుంది. హుబ్లీ వేదికగా ముగిసిన ఫైనల్లో 8 సార్లు ఛాంపియన్ అయిన కర్నాటకతో మ్యాచ్ డ్రాగా ముగిసినా, తొలి ఇన్నింగ్స్‌లో సాధించిన 291 పరుగుల భారీ ఆధిక్యంతో జమ్మూ కశ్మీర్ విజేతగా నిలిచింది. ఈ చారిత్రక విజయంతో జట్టు సభ్యులు, అభిమానుల ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి.

మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ ఎంచుకున్న జమ్మూ కశ్మీర్ బ్యాటర్లు అద్వితీయ ప్రదర్శన కనబర్చారు. శుభమ్ పుండిర్ (117) రంజీ ఫైనల్లో సెంచరీ చేసిన తొలి కశ్మీర్ బ్యాటర్‌గా రికార్డు సృష్టించాడు. యావర్ హసన్ (88), కనిష్క వధావన్ (70), సాహిల్ లోత్రా (72) విలువైన ఇన్నింగ్స్‌లతో జట్టుకు అండగా నిలవడంతో తొలి ఇన్నింగ్స్‌లో 584 పరుగుల భారీ స్కోరు నమోదు చేసింది. కర్ణాటక బౌలర్లలో ప్రసిద్ధ్ కృష్ణ ఐదు వికెట్లు పడగొట్టినప్పటికీ, ప్రత్యర్థి బ్యాటర్లను కట్టడి చేయలేకపోయాడు.అనంతరం బ్యాటింగ్‌కు దిగిన కర్ణాటకను జమ్మూ కశ్మీర్ బౌలర్లు వణికించారు. ముఖ్యంగా అకిబ్ నబీ దార్ (5/54) అద్భుత బౌలింగ్‌తో ఐదు వికెట్లు సాధించి కర్ణాటక పతనానికి కారణమయ్యాడు. కెప్టెన్ మయాంక్ అగర్వాల్ (160) ఒంటరి పోరాటం చేసినా మిగతా బ్యాటర్లు విఫలం కావడంతో కర్ణాటక 293 పరుగులకే ఆలౌట్ అయింది. దీంతో జమ్మూ కశ్మీర్‌కు కీలకమైన తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం లభించింది.

రెండో ఇన్నింగ్స్‌లోనూ జమ్మూ కశ్మీర్ ఆధిపత్యాన్ని కొనసాగించింది. ఓపెనర్ కమ్రాన్ ఇక్బాల్ (160 నాటౌట్), సాహిల్ లోత్రా (101 నాటౌట్) అజేయ సెంచరీలతో కర్ణాటక ఆశలపై నీళ్లు చల్లారు. జమ్మూ కశ్మీర్ 342/4 వద్ద ఇన్నింగ్స్ డిక్లేర్ చేయడంతో మ్యాచ్ నిబంధనల ప్రకారం డ్రాగా ముగిసింది. తొలి ఇన్నింగ్స్ ఆధిక్యంతో జమ్మూ కశ్మీర్ చాంపియన్‌గా నిలిచి దేశవాళీ క్రికెట్ చరిత్రలో సువర్ణాక్షరాలతో తన పేరును లిఖించింది.

# ఆరోగ్య రంగంలో చారిత్రాత్మక ఘట్టానికి శ్రీకారం



**బలగం టీవీ, హైదరాబాద్**

హైదరాబాద్ నగరంలోని కింగ్ కోఠి హాస్పిటల్లో హెచ్‌పీవీ వ్యాక్సినేషన్ డ్రైవ్‌ను రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ప్రారంభించారు. ఈ సందర్భంగా టీకా వేయించుకున్న బాలికలకు వ్యాక్సినేషన్ సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో ఎంపీ అనిల్ కుమార్ యాదవ్ పాల్గొన్నారు. నేటి నుంచి మూడు నెలలపాటు రాష్ట్రవ్యాప్తంగా ఈ వ్యాక్సినేషన్ కార్యక్రమం కొనసాగనుంది. తొలి నెల రోజులపాటు ప్రభుత్వ జనరల్ ఆసుపత్రులు, ఏరియా ఆసుపత్రులు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో టీకా అందుబాటులో ఉంటుంది. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోనూ హెచ్‌పీవీ టీకా అందుబాటులోకి తీసుకురానున్నారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ఆరోగ్య రంగంలో చారిత్రాత్మక ఘట్టానికి శ్రీకారం చుట్టామని పేర్కొన్నారు. మారుతున్న జీవనశైలి, ఆహారపు అలవాట్లు, కాలుష్యం వంటి కారణాలతో క్యాన్సర్ కేసులు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఏటా 55,000 నుండి 60,000 వరకు క్యాన్సర్ కేసులు నమోదవుతున్నాయని, రాబోయే ఐదేళ్లలో ఈ సంఖ్య 10 శాతం పెరిగే అవకాశముందని నిపుణులు హెచ్చరిస్తున్నారని తెలిపారు.క్యాన్సర్ నియంత్రణ కోసం సమగ్ర విధానాన్ని ప్రభుత్వం అమలు చేస్తున్నదని, హైదరాబాద్‌కే పరిమితం కాకుండా ములుగు, ఆదిలాబాద్ వంటి జిల్లాల్లోనూ కీమోథెరపీ సేవలను అందుబాటులోకి తీసుకువచ్చామని వివరించారు. ప్రతి జిల్లాలో డే కేర్ క్యాన్సర్ సెంటర్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ముందస్తు గుర్తింపునకు మొబైల్ స్క్రీనింగ్ యూనిట్లు, ఆరోగ్య మహిళ క్లినిక్‌ల ద్వారా పరీక్షలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు.

త్వరలోనే క్యాన్సర్‌ను నోటిఫైబుల్ వ్యాధిగా ప్రకటించి మరింత పకడ్బందీ చర్యలు తీసుకుంటామని మంత్రి స్పష్టం చేశారు. క్యాన్సర్ చికిత్స రంగంలో ప్రఖ్యాతి గాంచిన డాక్టర్ నోరి దత్తాత్రేయుడిని సలహాదారుగా నియమించి చర్యలు చేపడుతున్నామని తెలిపారు.దేశంలో మహిళల్లో వచ్చే క్యాన్సర్లలో గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ రెండో స్థానంలో ఉందని, రాష్ట్రంలో ఏటా సగటున 3,200 మంది మహిళలు ఈ వ్యాధి బారిన పడుతున్నారని మంత్రి వెల్లడించారు. ఈ వ్యాధి 99.7 శాతం కేసుల్లో హ్యూమన్ పాపిలోమా వైరస్ వల్లే వస్తుందని చెప్పారు.ఈ నేపథ్యంలో 14 ఏళ్లు పూర్తయి 15 ఏళ్లు లోపు ఉన్న బాలికలందరికీ హెచ్‌పీవీ టీకా ఇవ్వనున్నట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 3.5 నుంచి 4 లక్షల బాలికలకు వచ్చే మూడు నెలల్లో టీకాలు వేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని పేర్కొన్నారు. ప్రైవేట్ ఆసుపత్రుల్లో ఒక్క డోసు టీకా కోసం రూ.3,000 నుంచి రూ.4,000 వరకు ఖర్చవుతుందని, అయితే ప్రభుత్వం ఈ వ్యాక్సిన్‌ను పూర్తిగా ఉచితంగా అందిస్తున్నదని వివరించారు. తల్లిదండ్రులు ముందుకు వచ్చి తమ పిల్లలకు టీకా వేయించాలన్నారు. ఆరోగ్య శాఖ ప్రధాన కార్యదర్శి క్రిస్టినా జడ్ చొంగ్తు, ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమ కమిషనర్ డాక్టర్ సంగీత సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# ఏపీలో ఘోర పేలుడు

(మొదటి పేజీ తరువాయి)

సంభవించినట్లు సమాచారం.

ప్రమాద ఘటనపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. విజయనగరం పర్యటనలో ఉన్న సీఎం ప్రమాద వివరాలు తెలుసుకుని తక్షణ సహాయక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. మంత్రులు, ఉన్నతాధికారులు ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితులను పర్యవేక్షించాలని సూచించారు. హోం మంత్రి అనిత ఘటనాస్థలానికి వెళ్లాలని సీఎం ఆదేశించారు. జిల్లా అధికారులను అప్రమత్తం చేసి సహాయక చర్యలు వేగవంతం చేయాలని స్పష్టం చేశారు. ఘటన సమాచారం అందుకున్న వెంటనే జిల్లా కలెక్టర్ షణ్మోహన్, జిల్లా ఎస్పీ బిందు మాధవ్ సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. రెవెన్యూ, వైద్య ఆరోగ్యం, అగ్నిమాపక, పోలీసు శాఖల అధికారులను అప్రమత్తం చేశారు. క్షతగాత్రులను కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు కొనసాగుతోంది. పూర్తి వివరాలు వెలువడాల్సి ఉంది.

# మదీనా బస్సు ప్రమాద బాధితులకు పరిహారం

(మొదటి పేజీ తరువాయి)

ముస్లిం సోదరులతో తనకున్న అనుబంధాన్ని సీఎం ప్రస్తావించారు. 2009లో కొడంగల్ ఎమ్మెల్యేగా ఎన్నికైనప్పటి నుంచి ప్రతి సంవత్సరం అయిదుగురిని తన సొంత ఖర్చులతో హజ్ యాత్రకు పంపుతున్నానని తెలిపారు. వారిని ఎంపిక చేసే బాధ్యతను స్థానిక మత పెద్దలకు అప్పగించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి అజారుద్దీన్, ప్రభుత్వ సలహాదారులు వేమ్ నరేందర్ రెడ్డి, మహమ్మద్ షబ్బీర్ అలీ, నాంపల్లి ఎమ్మెల్యే మాజీద్ హుస్సేన్, హజ్ కమిటీ ఛైర్మన్ ఖుస్రో పాషా, తెలంగాణ మైనారిటీస్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ సొసైటీ (౧+వీక్మజుక్మీూ) వైస్ ఛైర్మన్ ఫహీం ఖురేషి, రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్ తదితరులు పాల్గొన్నారు.